
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
మంగళవారం 30, జనవరి 2024




## ఓటరు సవరణ పకడ్బందిగా నిర్వహించాలి

- ఓటరు జాబితా పరిశీలకురాలు బాలమాయా దేవి



2 లో..

# అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుస్తుంది..

-అధికారుల కృషి అభినందనీయం..
-గిట్టుబాటు ధర 18000 వచ్చేవరకు కేంద్రంపై ఒత్తిడి తెస్తాం
-పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శనలో  తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు...



దమ్మపేట, సూర్య (మేజర్ న్యూస్ )- తెలంగాణ రాష్ట్రంలోనే అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ అగ్రగామిగా నిలుస్తుందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మరియు పట్టు పరిశ్రమ, మార్కెటింగ్ శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు సోమవారం మండల పరిధిలోని అప్పారావుపేట గ్రామంలో ఉన్న పామయిల్ ఫ్యాక్టరీని ఆయన సందర్శించారు ఈ సందర్భంగా పామ్ ఆయిల్ ప్లాంట్ లో  కలయ తిరిగి ప్లాంట్ పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు

2 లో..

## కక్ష సాధింపు చర్యలను మానుకోవాలి

-విలేఖరుల సమావేశంలో కీర్తన



4 లో..

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్



4 లో..

## ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల


2 లో..




కొత్తగూడెం కలెక్టరేట్ ,సూర్య (మేజర్ న్యూస్ )
- ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు.

# పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన!

- కసరత్తు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం
- ఎంబీ రికార్డులు ఉంటేనే బిల్లుల చెల్లింపులు



2 లో..

పినపాక సూర్య (మేజర్ న్యూస్) -
సర్పంచ్‌ల పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన అమలులోకి రానున్నది.పంచాయతీ ఎన్నికలు 2019 జనవరిలో జరిగిన విషయం తెలిసిందే. వీరి పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగుస్తున్నప్పటికీ తిరిగి ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదని తెలుస్తున్నది. ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాల మేరకు పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్ల నియామకాలకు జిల్లా యంత్రాంగం కసరత్తు పూర్తిచేసింది. పంచాయతీలవారీగా స్పెషల్ ఆఫీసర్ల జాబితాను సిద్ధం చేసింది.

# అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుస్తుంది..





ఈ క్రమంలోనే పామాయిల్ ప్లాంట్ లో వ్యర్థాల నుండి వచ్చే నీటిలో తయారయ్యే డి మార్ట్ పౌడర్ వల్ల కలిగే లాభాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అధికారులు వివరించారు డి మార్ట్ పౌడర్ పశువుల దాణాలో కలిపితే వాటిలో ఉండే ప్రోటీన్ల శాతంతో పశువులలో పాల ఉత్పత్తి పెరుగుతుందని మంత్రి తుమ్మలకు తెలిపారు ఈ డి మార్ట్ పౌడర్ ను పశువుల దాణా ఫ్యాక్టరీ వారు కొనుగోలు చేస్తారని ఆయనకు తెలిపారు ఈ సందర్భంగా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు పాత్రికేయులతో కాసేపు మాట్లాడారు ఉభయ రాష్ట్రాల రైతుల శ్రేయస్సు కోసం అప్పారావుపేటలో సుమారు 100 కోట్ల రూపాయలతో లేటెస్ట్ మిషనరీ తో ఫ్యాక్టరీ ని నిర్మాణం చేశామని గతంలో ఉన్న పామ్ ఆయిల్ ఫ్యాక్టరీలలో ఆయిల్ శాతం తగ్గి రైతులకు గిట్టుబాటు ధర రాకపోవటం వలన ఈ ఫ్యాక్టరీని నిర్మాణం చేశామని అన్నారు ఫ్యాక్టరీ నిర్మాణం తర్వాత ఈ ప్రాంత ఆయిల్ ఫామ్ పంటతో ఆయిల్ శాతం పెరిగి రైతులకు ఆదాయం పెరగడం చేత తెలంగాణ ప్రాంతంలో పామాయిల్ సాగు పెరిగిందని అన్నారు గతంలో ఫ్యాక్టరీ నుంచి వ్యర్థాలు బయటికి వెళ్ళావని దానివల్ల భూగర్భ జలాలలో కాలుష్యం చేరి త్రాగునీరులో వ్యర్థాలు కలిసేవని ఇప్పుడు సుమారు 30 కోట్ల రూపాయలతో వ్యర్థాలు బయటికి వెళ్లకుండా వీటిలోనే నీరు తయారయ్యి మళ్ళీ ఆ నీరు పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ కి ఉపయోగపడేలా ఏర్పడిందని అన్నారు ఈ వ్యర్థపు నీరులోంచి వచ్చే డి మార్ట్ పౌడర్ పశువుల దానలో కలిపి పెడితే పశువుల పాల ఉత్పత్తి అధిక శాతం పెరుగుతుందని అన్నారు పామాయిల్ ఫ్యాక్టరీ నుండి ఎటువంటి లబ్ధి చేకూరిన అది రైతులకు తప్పకుండా అందాలని అధికారులకు తెలిపారు త్వరలో నూతనంగా 30 టన్నుల రన్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు ప్రస్తుతం అధికంగా ఉన్న పామాయిల్ పంటను దృష్టిలో ఉంచుకొని మరో 30 టన్నుల సామర్థ్యం కలిగిన రన్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనున్నమన్నారు రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్రంలో మరో ఐదు పామాయిల్ ఫ్యాక్టరీలను ప్రభుత్వం మంజూరు చెసిందని మహబూబ్ నగర్, సిద్దిపేట,మహబూబ్ బాద్, సత్తుపల్లి,ఫ్యాక్టరీ లు అ క్కడి పామాయిల్ పంటలు చేతికొచ్చే సమయానికి ఫ్యాక్టరీల నిర్మాణ పూర్తవుతాయని వీటితోపాటు ప్రైవేట్ ఫ్యాక్టరీలు కూడా రానున్నాయని తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పామాయిల్ పంటను అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని అన్నారు ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావాస్ వెళ్లినప్పుడు కొన్ని కంపెనీలతో భేటీ అవ్వడం జరిగిందని గతంలో పామాయిల్ విత్తనం కోసం ఇండోనేషియా, మలేషియా ప్రాంతాల నుండి దిగుమతి చేసుకున్నామని ఇప్పుడు గోద్రెజ్ కంపెనీ ద్వారా సీడ్ కంపెనీని ఇక్కడ ఏర్పాటు చేయనున్నదని తెలిపారు అది కూడా ఖమ్మం జిల్లాలోనే ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలిపినట్లు పేర్కొన్నారు ఈ గాడ్రెజ్ సీడ్ ఫ్యాక్టరీని కూడా వచ్చే సీజన్ లోపు ఏర్పాటు చేస్తామని అన్నారు ఖమ్మం జిల్లాలో పంటలు సస్యశ్యామలంగా ఉన్నప్పటికీ పామాయిల్ పంట ధర కొంత తగ్గిన పంటను ఎలా కాపాడుకుంటున్నారో రాబోవుకాలంలో గిట్టుబాటు ధర కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి 18 వేల రూపాయలు గిట్టుబాటు ధర ఇచ్చే విధంగా కృషి చేస్తానని అన్నారు అన్ని రాష్ట్రాలను కలుపుకొని పోయి పామాయిల్ పంటకు 18 వేల రూపాయలు మద్దతు ధర తగ్గకుండా ఉండేలా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు పామాయిల్ రైతుల పరిస్థితి మెరుగుపడే విధంగా చూస్తామని అన్నారు ఇప్పటికే 90,000 కోట్ల రూపాయలు ఆయిల్ కోసం ఇతర దేశాలకు చెల్లిస్తున్నామని గిట్టుబాటు ధర తగ్గితే దాంట్లో కొంతైనా రైతులకు వెచ్చించి మిగతా నష్టానికి కేంద్ర ప్రభుత్వం భరించాలనే నినాదం కూడా కేంద్ర ప్రభుత్వం వరకు తీసుకెళ్తామని అన్నారు రైతులకు గిట్టుబాటు ధర ఇప్పించి వ్యవసాయ శాఖ మంత్రి గా బాధ్యతలు చేపట్టేలా చేసినరైతుల రుణం తీర్చుకుంటానని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులు అభిమానులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

సోమవారం ఐడిఓసి కార్యాలయంలో ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహణపై విద్యా, రెవిన్యూ, పోలీస్, వైద్య, పంచాయతీ, మున్సిపల్, విద్యుత్, పోస్టల్, ఆర్టీసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 28వ తేదీ నుండి మార్చి 19వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగనున్నాయని చెప్పారు. మొదటి సంవత్సరం 10200 మంది, 2వ సంవత్సరం 9277 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు. పరీక్షలు నిర్వహణకు 36 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని పరిక్ష కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. 16 పోలీస్ స్టేషన్స్ లో ప్రశ్న పత్రాలను బద్రపరచనున్నట్లు చెప్పారు. 36 మంది ఛీఫ్ సూపరిన్టెండ్లు, 36 మంది శాఖాపరమైన అధికారులు, 13 మంది అదనపు పర్యవేక్షకులు విధులు నిర్వహించనున్నట్లు చెప్పారు. మూడు సిట్టింగ్ స్క్వాడ్స్, ఐదు కస్టోడియన్స్ నియమిస్తున్నట్లు చెప్పారు. 550 మంది ఇన్విజిలేటర్లుకు విధులు కేటాయించినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని చెప్పారు. సమీపంలోని జిరాక్సు కేంద్రాలను మూసివేయించాలని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో చేయాల్సిన ఏర్పాట్లుపై చెక్ లిస్టు తయారు చేయాలని చెప్పారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో అత్యవసర వైద్య కేంద్రం ఏర్పాటుతో పాటు తగినన్ని మందులను, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో అత్యవసర వైద్యసేవలకు వార్డులను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. పంచాయతీ, మున్సిపల్ అధికారులు పరీక్షా కేంద్రాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. సురక్షిత చల్లటి మంచినీరు సరఫరా చేయాలని చెప్పారు. విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర సరఫరా చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. మారుమూల ప్రాంతాల విద్యార్థులు సకాలలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి వీలుగా అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని, ఇతర డిపోల నుండి బస్సులు నడిపేందుకు ఆయా డిపో మేనేజర్లుకు లేఖలు వ్రాయాలని చెప్పారు. విద్యార్థులు బయాందోళనలకు గురికాకుండా, ధైర్యంగా పరీక్షలు వ్రాసేందుకు మోటివేషన్ తరగతులు నిర్వహించాలని చెప్పారు. పరీక్షలు నిర్వహణలో ఎలాంటి సంఘటనలకు తావు ఇవ్వొద్దని చెప్పారు. పరీక్షలకు కొద్దిరోజుల సమయం ఉన్నందున సబ్జెక్టుల్లో వెనుకంజలో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని చెప్పారు. విద్యార్థులకు మాక్ పరీక్షలు నిర్వహిస్తూ సన్నద్ధం చేయాలని చెప్పారు. నూరుశాతం ఫలితాలు సాధించు విధంగా కృషి చేయాలని చెప్పారు. పరీక్షలు నిర్వహణలో విధులు కేటాయించిన సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహణకు షెడ్యూలు తయారు చేయాలని ఆర్ ఐఓ సులోచనారాణికి సూచించారు. విధులు కేటాయించిన సిబ్బదికి డ్యూటి పాసులు జారీ చేయాలని, పాసులు లేని వ్యక్తులను ఎట్టిపరిస్థిల్లో కేంద్రాల్లోకి అనుమతించొద్దని చెప్పారు. విద్యార్థులు కానీ, విధులు నిర్వహించే సిబ్బంది కానీ పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఎలాక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లడానికి అనుమతి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. నిశిత పరిశీలన తదుపరి పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్ రాజు,జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సులోచనారాణి, డిఆర్ఓ రవీంద్రనాథ్, డిపిఓ రమాకాంత్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష, డీఈఓ వెంకటేశ్వరా చారి, విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు సవరణ పకడ్బందిగా నిర్వహించాలి

కొత్తగూడెం కలెక్టరేట్ ,సూర్య (మేజర్ న్యూస్ )–ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని పకడ్బందిగా నిర్వహించాలని ఓటరు జాబితా పరిశీలకురాలు బాలమాయా దేవి తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయపు మిని సమావేశపు హాలులో రిటర్నింగ్ అధికారుల, సహాయ రిటర్నింగ్ అధికారులతో ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం, ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె నియోజకవర్గాల వారిగా ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల వ తేదీన ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలోని 1095 పోలింగ్ కేంద్రాల పరిధిలో 972858 మంది ఓటర్లున్నట్లు చెప్పారు. ఈ నెల 6వ తేదీ నుండి 22వ తేదీ వరకు ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరించినట్లు చెప్పారు. అలాగే 20, 21 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక క్యాంపుల్లో ఫారం 6–1149, ఫారం 7–382, ఫారం 8– 860 ధరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం ఫారం 6,7,8లకు 59658 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 47612 దరఖాస్తులు విచారణ ప్రక్రియ పూర్తి కాగా, 4454 దరఖాస్తులు తిరస్కరించారని, 7589 దరఖాస్తులు విచారణ దశలో ఉన్నట్లు చెప్పారు. వచ్చే నెల 6వ తేదీ డేటా ప్రక్రియ పూర్తి చేసి 8వ తేదీన తుది ఓటరు జాబితా ప్రకటించనున్నట్లు చెప్పారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగానికి సంబంధించి తుది ఓటరు జాబితా రూపకల్పన చేయనున్నట్లు ఆమె వివరించారు. ఓటరు జాబితా ప్రక్రియ రూపకల్పనపై నియోజకవర్గాల వారిగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి వారం సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. జిల్లాలో ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం 14075 మంది దివ్యాంగ ఓటర్లున్నారని చెప్పారు. అలాగే 18–19 సంవత్సరాల వయస్సున్న ఓటర్లు 27490 మంది, 80 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 13106 మంది ఉన్నట్లు చెప్పారు. అశ్వారావుపేట నియోజకవర్గంలోని 8 హాబిటేషన్లలో ఉన్న అర్హులైన కొండరెడ్లు 692 మందికి ఓటుహక్కు నమోదు చేసినట్లు చెప్పారు. 1950 కంట్రోల్ రూముకు, ఎన్వీఆర్ఎస్ పోర్టల్కు వచ్చిన పిర్యాదులు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని చెప్పారు. శాసనమండలి ఎన్నికలకు సంబంధించిన ఓటరు నమోదుపై పిర్యాదులు వస్తున్నాయని ఎప్పటికపుడు పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ముసాయిదా ఓటరు జాబితాలో ఓటరు బాధ్యతగా తన ఓటుహక్కును పరిశీలించుకోవాలని, ఏదేని పొరపాట్లుంటే నిర్దేశిత ప్రొఫార్మాలో దరఖాస్తులు చేయాలని చెప్పారు. ఓటర్లు పరిశీలన చేయకుండా చివరి వరకు వేచి ఉండి ఓటుహక్కు లేదనే పిర్యాదులు రావొద్దని ఆమె సూచించారు. అనంతరం శాసనసభ ఎన్నికలు ప్రక్రియ నిర్వహించిన తీరును అభినందించారు. ఇదే స్ఫూర్తితో రానున్న ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని చెప్పారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ జిల్లాలో మరణించిన ఓటర్లును జాబితా నుండి తొలగింపుకు ఫారం 7 జారీ చేస్తున్నామని చెప్పారు. నోటీసులు జారీ చేసిన 7 రోజుల తదుపరి తొలగింపుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మరణించిన వ్యక్తుల మరణ ధృవీకరణ ఆధారంగా మరణ ధృవీకరణ అందుబాటులోని సందర్భంలో కుటుంబ సభ్యుల వాంగ్మూలాన్ని పరిగణలోకి తీసుకుని తొలగిస్తున్నట్లు చెప్పారు. వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో విచారణ చేపిస్తూ బద్రపరుస్తున్నట్లు చెప్పారు.ఈ సమావేశంలో ఐడిడిఏ పిఓ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ రాంబాబు. కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు శిరీష, మంగిలాల్, ప్రత్యేక ఉప కలెక్టర్ కాశయ్య, ఎన్నికల విభాగం తహసిల్దార్ దారా ప్రసాద్, నాయబ్ తహసిల్దార్ రంగ ప్రసాద్, నియోజక వర్గ కేంద్రాల తహసిల్దారులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన!

ప్రభుత్వం అడిగిందే తడవుగా జాబితాను పంపించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నది.ఆయా శాఖల ఉద్యోగులకు బాధ్యతలు జిల్లాలో 647 గ్రామ పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లుగా జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లను నియమిస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలలో పనిచేస్తున్న వీరికి అవసరాలను బట్టి ఒక్కొక్కరికి ఒకటి లేదా రెండు గ్రామ పంచాయతీలను కేటాయించనున్నారు. వీరిపై తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలను పర్యవేక్షణ అధికారులుగా నియమించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది.

**–ఎంబీ రికార్డులుంటేనే చెల్లింపులు**

జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు తమ పదవీ కాలంలో చేపట్టిన బిల్లుల చెల్లింపులకు కచ్చితంగా ఎంబీ రికార్డులు ఉండాల్సిందేనని పంచాయతీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం, ఉపాధి హామీ, ఎస్ఎఫ్‌సీ, జనరల్ ఫండ్ ద్వారా నిధులు మంజూరయ్యాయి. వీటి ద్వారా గ్రామ పంచాయతీల్లో వివిధ పనులను చేపట్టడం జరిగింది. ఆయా పనుల్ల చాలావాటికి బిల్లులు చెల్లింపులు జరగలేదు. పదవీ కాలం ముగుస్తున్నా చేసిన బిల్లులు రాకపోవడంతో సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయమై జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ వద్ద ప్రస్తావించగా పంచాయతీలలో పూర్తిచేసిన పనులకు సంబంధించి ఈనెలాఖరులోగా ఎంబీరికార్డులు, గ్రామ పంచాయతీ తీర్మానాలు, స్టాక్ రిజిస్టర్ ఉంటే బిల్లులు చెల్లింపులో ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు.

# కరాటే పోటీలలో కస్తూర్బా పాఠశాల విద్యార్థినిల ప్రతిభ..

**-స్వర్ణాలు- 23, రజితం- 3, కాంస్య- 4 పథకాలు కైవసం**
**-విద్యార్థినిలను అభినందించిన ఉపాధ్యాయులు..**





**అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్ న్యూస్)**-తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో గురుకులాలు, కస్తూరిబా పాఠశాలలు ఏర్పాటు చేసి అన్ని వసతులు సమకూరుస్తున్నారు. విద్యార్థినిలకు విద్యా బోధనతోపాటు క్రీడలు, ఆత్మరక్షణ శిక్షణలు అందిస్తున్నారు. ఆత్మరక్షణ శిక్షణ (కరాటే) నేర్చుకున్న విద్యార్థినిలకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు ఏర్పాటు చేసి నైపుణ్యం కలిగిన వారికి బహుమతులు అందజేస్తున్నారు . అందులో భాగంగా మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థినిలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఆదివారం తెలంగాణ- ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కరాటే ఛాంపియన్షిప్ 2024 ఆధ్వర్యంలో జరిగిన కరాటే పోటీలలో స్వర్ణాలు 23, రజితాలు 3, కాంస్య పథకాలు 4 కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థినిలను సోమవారం పాఠశాల ప్రత్యేక అధికారి పి కవిత అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను దృష్టిలో ఉంచుకొని వారు తమను తాము రక్షించుకోవడానికి కరాటే ఎంతో ఉపయోగపడుతుందని బాలికలకు కరాటే ఎంతో అవసరం అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలోని బాలికలకు ఆత్మరక్షణ శిక్షణ ఇప్పించడం జరిగిందని, శిక్షణ ఇచ్చిన మాస్టర్ బి ప్రవీణ్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల నుండి కొత్తగూడెంలో జరిగిన కరాటే పోటీలలో 30 మంది పాల్గొని 30 బహుమతులు తీసుకువచ్చి పాఠశాల పేరును రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చినందుకు విద్యార్థినిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు, ఉపాధ్యాయులు. సిబ్బంది పాల్గొని విద్యార్థినులను అభినందించారు.

# పినపాక ఎంపీఓకు ఘనంగా సన్మానం



పినపాక సూర్య (మేజర్ న్యూస్)-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మారుమూల ఏజెన్సీ మండలమైన పినపాక ఎంపీఓగా బాధ్యతలు నిర్వహిస్తూ మండలానికి ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఎంపీఓ వెంకటేశ్వరరావును పినపాక మండలంలో సర్పంచులు, సెక్రటరీలు, ఎంపీటీసీలు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. పినపాక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ గుమ్మడి గాంధీ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ గుమ్మడి గాంధీ మాట్లాడుతూ పినపాక మండలాన్ని అభివృద్ధి పథంలో ఎనిమిది నెలలలోనే నడిపించిన ఘనత ఎంపీఓ కు దక్కుతుందని తెలియజేశారు. ఇలాంటి మంచి ఆఫీసర్ పినపాక మండలంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. అనంతరం ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎంపీఓ కు ఉత్తమ ఉద్యోగిగా అవార్డు రావడం అభినందనీయమన్నారు. మండలంలో సమస్యలపై ఆయన స్పందన, పరిష్కరించే తీరును అభినందించారు. అనంతరం సర్పంచుల సంఘం అధ్యక్షులు నరసింహారావు మాట్లాడుతూ గ్రామపంచాయతీలో సమస్యలు పరిష్కరించడంలో, సర్పంచులకు మార్గదర్శకం చూపించడంలో ఎంపీఓ సేవలను కొనియాడారు. ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షులు చింతపంటి సత్యం మాట్లాడుతూ ఎంపీవో చేస్తున్న శ్రమకు గుర్తింపు ఉత్తమ ఆఫీసర్ గా గుర్తింపురావడం అన్నారు. ప్రతి సమస్యను తానే స్వయంగా పరిశీలించి పరిష్కరించే గుణం ఉన్న గొప్ప ఆఫీసర్ పినపాకలో పనిచేయటం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. అనంతరం పొట్లపల్లి సర్పంచ్ కళ్యాణి మాట్లాడుతూ సర్పంచులకు మార్గదర్శకం చూపించడంలో పాటు విధివిధానాలు తెలపడంలో ఎంపీఓ సేవలు మరువలేనివి అన్నారు. ఇలాంటి ఆఫీసర్ ను తన పది సంవత్సరాలు సర్పంచ్ గా పనిచేసిన సమయంలో చూడలేదన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, గట్ల శ్రీనివాసరెడ్డి, నిశాంత్ రెడ్డి, ఆధ్వర్యంలో సైతం ఆయనను సన్మానించారు. అనంతరం పినపాక జర్నలిస్టులు గంగాధర్, భరత్, బృహస్పతి, సారయ్య, పలువురు జర్నలిస్టులు ఎంపీఓను ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమం అనంతరం ఎంపీఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ అవార్డు రావడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. తనకు సహకరించిన సెక్రటరీలకు, కంప్యూటర్ ఆపరేటర్లకు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ అవార్డ్ అందరి శ్రమకు గుర్తింపు తెచ్చిందన్నారు. మండల అభివృద్ధికి మరింతగా కృషి చేస్తానని తెలియజేశారు. కుర్చీలో నాలుగు గోడల మధ్య కూర్చొని పనిచేసే తత్వం, సమస్య వద్దకు వెళ్లి చూసి, పరిష్కరించే దిశగా పనిచేసే తత్వం తనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ శేఖర్, సర్పంచ్ లు గోగ్గల నాగేశ్వరరావు, కొరస కృష్ణంరాజు, నాగభూషణం, మహేష్, సునీల్, ఈసంభవతి, నాగేశ్వరరావు, తదితరులు, పాల్గొన్నారు.

## స్థానిక సమస్యలపై వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు కలిసిన సిపిఐ నాయకులు.

దమ్మపేట సూర్య (మేజర్ న్యూస్ )– తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను సోమవారం సిపిఐ పార్టీ మండల నాయకులు కలసి స్థానిక సమస్యలు గురించి వినతిపత్రం అందించారు. మండల కేంద్రంలో జూనియర్ కాలేజ్ మంజూరు చేయాలని మంజూరు అయి ప్రారంభోత్సవానికి నోచుకోని కోర్టు ను వెంటనే ప్రారంభించాలని వినతిపత్రం లో తెలిపారు. స్పందించిన మంత్రి తుమ్మల సమస్యల పరిష్కారనికి కృషి చేస్తానని హామి ఇచ్చారు. మంత్రి తుమ్మల తో పాటు స్థానిక శాసన సభ్యులు జారే ఆదినారాయణ కు కూడా వినతిపత్రం ను అందించారు ఈ కార్యక్రమం లో సిపిఐ మండల నాయకులు సుంకుపాక ధర్మ, బెజవాడ రాము ఉన్నారు.



## ఆ రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టండి

**– పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించిన శాసనసభ్యులు పాయం**



పినపాక సూర్య (మేజర్ న్యూస్)–పినపాక మండలం దేవనగరం నుండి మద్దులగూడెం గ్రామాల మధ్యలో ప్రధాన రహదారికి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశించారు. గత సంవత్సరం క్రితం వరదతో రహదారి కొట్టుకుపోవడం తో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రజల సమస్యలు గమనించిన స్థానిక శాసనసభ్యులు పాయం ఆ రహదారికి, కల్వర్టులకు వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు.

## నరేంద్ర మోడి ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి.- అబ్దుల్ నబీ.



ఇల్లందుటౌన్,సూర్య (మేజర్ న్యూస్)– నరేంద్ర మోడీ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంఘటిత అసంగటిత రంగంలో పనిచేస్తున్న కార్మిక, కర్షక, రైతు ప్రజలందరూ ఫిబ్రవరి 16 వ తేదీన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేసేందుకు సిద్ధంగా ఉండాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ, జిల్లా నాయకురాలు ఎస్కే ఫాతిమా ఆశ యూనియన్ నాయకురాలు జరుపుల లలిత పిలుపునిచ్చారు. ప్రజా కంటకుడు నరేంద్ర మోడీ ప్రభుత్వంలో అన్ని రంగాలలో అధిక ధరల పెరుగుదల కార్మిక కర్షక రైతు ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న విధానాలను దేశవ్యాప్తంగా ప్రజలందరూ ఎండగట్టాలని వారు కోరారు. ఈ సందర్భంగా దేశవ్యాప్త జరుగు సమ్మె,గ్రామీణ బందు నేపథ్యంలో రొంపేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి యూడీసి పద్మ కు సోమవారంసమ్మె నోటీసు ఇచ్చారు.

## జిపి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడుగా గుగులోతు లక్ష్మణ్ ఎన్నిక.

ఇల్లందు టౌన్, సూర్య (మేజర్ న్యూస్)– ఇల్లందు మండలం కొమరం గ్రామపంచాయతీ చెందిన గుమస్తా తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడుగా గూగు లోతు లక్ష్మణ్ ఎన్నికయ్యారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రి,నం హెచ్ 106 ఐఎఫ్టియు అనుబంధం రాష్ట్ర మహాసభ వనపర్తి జిల్లా కేంద్రంలో28-1-23 న జరిగాయి. ఈ రాష్ట్ర మహాసభలో రాష్ట్ర అధ్యక్షులుగా కొత్తపల్లి రవి, తొర్రూరు మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అరుణ్ కుమార్,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాష్ట్ర సహాయ కార్యదర్శిగా వై గోపాలరావు, (జూలూరుపాడు)రాష్ట్ర కమిటీ సభ్యుడుగా గుగులోతు లక్ష్మణ్ ఇల్లందు మండలం కొమరారం గ్రామపంచాయతీ గుమస్తా గ్రామపంచాయతీ రాష్ట్ర మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని సిఐటీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షేక్ యాకూబ్ షావలి తెలిపారు.



## కరాటే ఛాంపియన్ షిప్ లో సెయింట్ విన్సెంట్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ





లక్ష్మిదేవిపల్లి,సూర్య (మేజర్ న్యూస్ )– మండల పరిధిలోని ఎదురుగడ్డ పంచాయతీలోని సెయింట్ విన్సెంట్ పాఠశాలకు చెందిన 28 మంది విద్యార్థులు ఇంద్రాల శ్రీధర్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఉర్దూ ఘర్ లో ఆదివారం జరిగిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి 2024 రిపబ్లిక్ కప్ ఓపెన్ కరాటే క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులకు గ్రామ సర్పంచ్ బానోత్ కవిత,ఈశ్వర్, పాఠశాల హెడ్ మాస్టర్ సుచిత్ర, కరాటే కోచ్ సెన్ సై, బి ప్రేమ్ కుమార్ బహుమతులు ప్రధానం చేశారు.

## కక్ష సాధింపు చర్యలను మానుకోవాలి

**–విలేఖరుల సమావేశంలో కీర్తన**

బూర్గంపాడు సూర్య (మేజర్ న్యూస్)–తనపై కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని లక్ష్మీపురం గ్రామానికి చెందిన కాటం కీర్తనరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్లో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడు తూ లక్ష్మీ పురంలోని ఓ వ్యక్తికి సంబంధించిన స్థలం 14 మందికి విక్రయించాడని, అందులో భాగంగా దుగ్గ కరుణ 2005లో సదరు వ్యక్తి నుంచి స్థలం కొనుగోలు చేయడం జరిగింద న్నారు. అయితే దుగ్గ కరుణ నుంచి తాను 99 సెంట్లు భూమిని కొనుగోలు చేయడం జరిగింద న్నారు. మా భూమిలో గల పాత రేకుల షెడ్కి స్థానిక పంచాయితీ కార్యాలయం నుండి హౌస్ నెంబర్ తీసుకున్నామన్నారు. అయితే భూమి విలువ పెరగడంతో దుగ్గ కరుణకు భూమి అమ్మిన సదరు వ్యక్తి, వారి కుటుంబ సభ్యులు 15 మంది భూమి తమదే అంటూ మాపై, మాకు స్థలం విక్రయించిన వారిపై దాడులకు పాల్పడు తుండగా వారిపై పోలీసుల ఫిర్యాదు సైతం చేశామని ఆమె పేర్కొన్నారు.వారిపై కేసు నమో దు కావడం జరిగిందన్నారు. అయితే తాను ఈవిషయం పై కోర్టును ఆశ్రయించడం జరిగిందని ఈ భూమి సమస్య కేసు కోర్టులో ఉందని ఆమె అన్నారు. అత్యాశతో వారు అధికారులపై, మాపై వేధింపులకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపిం చారు. సమస్య కోర్టులో ఉండగా మళ్ళీ ఓ కుల సంఘ నాయకులను వారి అబద్ధపు మాటలతో ఏమారుస్తు నిరసనలు, ధర్నాలను చేస్తున్నారని ఆమె ఆరోపించారు. సదరు వ్యక్తి 14 మందికి తనకున్న భూమిని అమ్మకం జరిపి ఎవరికి అమ్మ లేదంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని ఆమె అన్నారు.తాను ఒంటరి మహిళలను అని గ్రహించి వారికున్న కుల సంఘం నాయకులతో కలిసి భూమి ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని ఆమె పేర్కొన్నారు.ఈవిషయం పై అధికారులు తానకు న్యాయం చేయాలని ఆమె కోరారు. ఈసమావేశంలో దుగ్గ కరుణ, దుగ్గ వెంకటేశ్వ రరెడ్డి, కాటం రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.



## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



**– ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్**

భద్రాచలం సూర్య (మేజర్ న్యూస్):– జాతీయ స్థాయి రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా, వాహనచోదకులకు ట్రాఫిక్ పై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో సోమవారం భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు రోడ్డు మీద తమ వాహనాలను వ్యతిరేక దిశలో నడిపి ప్రమాదాలకు గురికావద్దని సూచించారు. వాహనాన్ని నడిపే డ్రైవర్లు కంటి చూపుపై అశ్రద్ధ చూపవద్దని దగ్గరచూపు, దూరపుచూపు లోపాలు ఉంటే కంటి వైద్యులను సంప్రదించి చూపించుకోవాలని కోరారు. డ్రైవర్లకు కంటిచూపు బాగా ఉంటేనే ప్రయాణికులను వారి గమ్యాలకు సురక్షితంగా చేర్చి, మీరు కూడా మీ కుటుంబాన్ని కలుసుకొని సంతోషంగా ఉంటారని తెలిపారు. డ్రైవర్లు సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని వారు డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికితే శిక్ష తప్పదని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు నివారించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు .రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం 20 నుంచి 30 సంవత్సరాల లోపు వారే అధిక శాతం మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడిపితే చట్టరీత్యా శిక్షలు తప్పవని హెచ్చరించారు. నిరంతరం జాతీయ రహదారిపై పోలీసుల నిఘా ఉంటుందని తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు నిర్లక్ష్యం,అతివేగం తగదని, వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేరాలన్నారు. బైక్ లపై వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ హెల్మెట్ అదే విధంగా కారు నడిపే సమయంలో సీట్ బెల్ట్ తప్పక ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ లు వెంకన్న , శ్రీనివాస్ , ట్రాఫిక్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

## భద్రాచలం లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం.

భద్రాచలం సూర్య (మేజర్ న్యూస్):– భద్రాచలం పట్టణంలో ఉన్న చినజియ్యర్ మఠం సమావేశ మందిరం నందు భద్రాచలం గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ లో 1969–71 ఇంటర్మీడియేట్ మొదటి బ్యాచ్ గా విద్యఅ భ్యసించిన పూర్వ విద్యార్థులు, విద్యార్థినిలు సమావేశమై పాత జ్ఞాపకాలు గుర్తుచేసుకుని ఒకరినొకరు ఆలింగనాలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. చిన్న నాటి సంఘటనలు అప్పటి ఆటలు పాటలు గుర్తుచేసుకుని మరలా విద్యార్థులలా మారిపోయి సంతోషంగా రోజంతా గడిపారు. విద్యనభ్యశించిన జూనియర్ కాలేజిని సందర్శించి వారు చదివిన గదులలో కూర్చిన పాత స్మృతులను గుర్తు చేసుకొని ఆనందం గా గడిపారు. రోజు వారీ కార్యక్రమాలకు భిన్నంగా గడిపి అందరూ ఆత్మీయంగా సంతోషం గా తిరుగుప్రయాణమై నారు. ఈ కార్యక్రమానికి ఆద్యంతం తానై నిర్వహించిన పూర్వ విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వ అవార్డ్ గ్రహీత లయన్ డాక్టర్ గోళ్ల భూపతి రావు, మరియు యార్లగడ్డ హనుమంత రావు లు , మిగతా మిత్రులు మల్లాది వెంకట రావు, కృష్ణ బాబు, వెంకటనరసయ, నాగభూషణం, సత్యనారాయణ రెడ్డి, ఆంజనేయ వర్మ, అప్పా రావు, రమణ రెడ్డి, కృష్ణ కుమార్ , సుబ్బారావు, శంకర్ రావు, శ్రీధర్, వర్మ, రాజు, రాంబాబు, ఉదయభా స్కర్, ప్రభాకర్, పటేల్, పద్మజ, శారద ,వెంకటమ్మ, విజయలక్ష్మి, సీత, పూర్వ విద్యార్థుల సమ్మేళనం కన్వీనర్ లయన్ డాక్టర్ గొల్ల భూపతిరావు తదితరులు పాల్గొన్నారు.



## శివాలయంలో అన్నదానం



అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్ న్యూస్)–మండల కేంద్రంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో ఆలయ మేనేజర్క పాల వెంకటరమణ పర్యవేక్షణలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, గోత్రనామార్చనలు, ధూపసేవా నాగ హారతి కార్యక్రమాలు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని భక్తుల సహకారంతో ఆలయ సిబ్బంది ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది మాట్లాడుతూ ప్రతి సోమవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసే అన్నదాన కార్యక్రమానికి అన్నదాతలుగా పాల్గొనదలచిన భక్తులు ఆలయ సిబ్బంది సెల్ నెం 9959108107ను సంప్రదించాలన్నారు.

## ఎండు గంజాయి స్వాధీనం



కొత్తగూడెం క్రైమ్,సూర్య(మేజర్ న్యూస్)– ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఖమ్మం డివిజన్ డిప్యూటీ కమిషనర్ ఇచ్చిన గంజాయి యాక్షన్ ప్లాన్ లో భాగంగా జిల్లా అబ్కారీ అధికారి జానయ్య , అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ కరం చంద్ ఆధ్వర్యంలో కొత్తగూడెం బస్ స్టేషన్ లో సోమవార తనిఖీలు నిర్వహిం చారు. ఈ తనికిలలో 21.5 కేజీల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు కొత్తగూడెం ఆబ్కారీ స్టేషన్ సీఐ జయశ్రీ తెలిపారు. ఎండు గంజాయి అక్రమ రవాణా సమాచారం మేరకు కొత్తగూడెం బస్ స్టాండ్ నందు తనిఖీలు చేపట్టి అనుమానాస్పదంగా ఉన్న ఒక బస్తా సంచిలో ఉంచిన ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు మరియు స్వాధీనం చేసుకున్న ట్లు తెలిపారు. పట్టుకున్న ఎండు గంజాయి విలువ బహిరంగ మార్కెట్లో సుమారు రూ 5.25 లక్షల వరకు ఉంటుందని సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్.ఐ గౌతమ్ సిబ్బంది హబీబ్ పాషా, రామకృష్ణ గౌడ్, వెంకట నారాయణ, గురవయ్య, సుమంత్ పాల్గొన్నారు.

## మండల ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో కృష్ణ మోహన్ గెలుపు



మణుగూరు,సూర్య(మేజర్ న్యూస్)– మండల ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నికలలో వన్నం కృష్ణమోహన్ 31 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. వారికి రాష్ట్ర, జిల్లా నాయకుల సమక్షంలో నియామక పత్రాలు అందజేయడం జరిగింది. వారికి జిల్లా కమిటీ తరపున శుభాకాంక్షలు తెలిపారు.

## రిపోర్టర్ కిషోర్ కి మాతృ వియోగం



అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్ న్యూస్)–మాజీ జవాన్ భార్య, ప్రజాపక్షం మండల రిపోర్టర్ ఇమ్మడి కిషోర్ కుమార్ మాతృ మూర్తి ఇమ్మడి తులసమ్మ(73)గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతు ఆదివారం మృతి చెందింది. సోమవారం అన్నపురెడ్డిపల్లి గ్రామంలో లోని స్వగృహంలో మృతురాలికి సాంప్రదాయ పద్ధతిలో అంతేమ ప్రయాణం చేశారు. .పలువురు రిపోర్టర్లు,ప్రజా ప్రతినిధులు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించి వారి కుటుంభానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు..

## రిపోర్టరు అక్కిశెటేట్టి రవి తేజ కు పిత్రు వియోగం

### అక్కిశెట్టి క్రిష్ణయ్య కు నివాళి అర్పించిన జర్నలిస్టులు



**వైరాసూర్యమేజర్ న్యూస్:**
వైరా మండలం విప్పాలమడక గ్రామానికి చెందిన ఏబియన్ టివి రిపోర్టరు అక్కిశెట్టి రవి తేజ తండ్రి అక్కిశెట్టి క్రిష్ణయ్య అనారోగ్యం తొ మరణించిన విషయం తెలుసుకున్న వైరా జర్నలిస్టులు విప్పాలమడక వెళ్ళి క్రిష్ణయ్య భౌతిక ఖాయం వద్ద నివాళి అర్పించారు.నివాళి అర్పించిన వారిలో సీనియర్ జర్నలిస్టు పారుపల్లి క్రిష్ణా రావు,ఏపురి రాజారావు,ఎక్కిరాల శ్రీనివాస్ రావు,మేడ సంపత్,పులి క్రిష్ణా ర్జునరావు,గొల్లమందల విజయ్,చింతల వసంత రావు,ఎడునుతల బుచ్చి రామారావు,పెద్ద ప్రోలు నవీన్,అది శ్రీకాంత్,రేచర్ల నాగరాజు,గుడిమేట్ల మోహనరావు, సయ్యద్. అతావుల్లా.సుతకాని శ్రీకాంత్,సీత రాములు,షేక్ .రఫి,దినేష్,గుండ్ల బాబు రావు,వీర రెడ్డి,నల్లమేతు శ్రీనివాస్ రావు,మరియు వీలసాగరం నరేష్,నారపోగు కిరణ్ తదితరులు ఉన్నారు.

## టీఎస్ఎఫ్ జాతీయ సదస్సుకు మాధారం సర్పంచ్



**సింగరేణి సూర్య మేజర్ న్యూస్**
సింగరేణి(కారేపల్లి జనవరి 29) ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో ఫిబ్రవరి 5,6 తేదిలలో జరిగే ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) జాతీయ సదస్సుకు కారేపల్లి మండలం మాధారం సర్పంచ్ టీఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుల్కైన అజ్మీర నరేష్ హాజరుకానున్నారు. దీనికి సంబంధించి టీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు మల్లి భాస్కర్ నుండి సదస్సుకు హాజరుకావటానికి ఆహ్వానం అందినట్లు సర్పంచ్ అజ్మీర నరేష్ తెలిపారు. ఈ సదస్సుకు ఏపీ ఉపముఖ్యమంత్రి పిడిక రాజన్నదొర,అరకు ఎంపీ గొడ్డెటి మాధవి తో పాటి 8 మంది ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో గిరిజన విద్యార్థుల సమస్యలపై చర్చించి కార్యాచరణ నిర్ణయించటం జరుగుతుందన్నారు.

## ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షులుగా మల్లెల సతీష్

**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్...**



పెనుబల్లి మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా మల్లెల సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షులు గోదా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన పెనుబల్లి మండలం ఫోటోగ్రాఫర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల నరసింహారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పెనుబల్లి మండలం యూనియన్ కమిటీని ఎన్నుకున్నారు. పెనుబల్లి మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా మల్లెల సతీష్, కార్యదర్శిగా చాట్ల వీరభద్రం, కోశాధికారిగా పెద్దప్రోలు వరప్రసాద్, ఉపాధ్యక్షులుగా అనంతోజు శ్రీనివాసరావు, వేముల మధుసూదన్ రావు, ప్రచార కార్యదర్శిగా వేముల సీతారాములు, సహాయ కార్యదర్శిగా పెరుమాళ్ళ శ్రీనివాసరావు లను నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్స్ వత్సవాయి కనకాచారి, వేముల రవి, జిల్లెల్ల ప్రసాద్, మల్లెల రాంబాబు, రంగాచారి, గుజ్జ హరీష్, మిద్దె భాస్కర్, చలపతిరావు, రంజాన్ వలి, కొప్పుల గోపాల్, వేముల వెంకటేశ్వరరావు, మరకాల మధు, బజ్జూరు నాగేశ్వరావు, జిల్లెల్ల వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

## పాటిమీదిగుంపు టీచర్ల గైర్హాజరుపై ఎంపీడీవో అగ్రహం

### అందరికి సెలవులిస్తారా ?ఎంపీడీవో

**సింగరేణి సూర్య మేజర్ న్యూస్**
సింగరేణి(కారేపల్లి జనవరి 29) మండలంలోని పాటిమీదిగుంపు ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ముకూమ్మడిగా నల్గురిలో ముగ్గురు సెలవులు పెట్టటంపై ఎంపీడీవో చంద్రశేఖర్ అగ్రహం వ్యక్తం చేశారు. యూపీఎస్ పాటిమీదిగుంపులో 82 మంది విద్యార్థులకు 4గురు ఉపాధ్యాయులు ఉన్నారు. సోమవారం నల్గురిలో ఒకరు మాత్రమే విధులకు హాజరుకావటంతో కొందరు గ్రామస్తులు ఎంపీడీవో చంద్రశేఖర్‌కు ఫోన్‌లో పిర్యాదు చేశారు. ఎంపీడీవో కార్యాలయలో విలేకరులతో మాట్లాడుతున్న సమయంలో ఉపాధ్యాయులు సెలవులపై పిర్యాదు రావటంతో సంబంధింత ఉపాధ్యాయులు, బాధ్యులపై ఎంపీడీవో అగ్రహం వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థ అస్తవ్యస్థంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సీఆర్‌పీ సురేష్‌కు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నల్గురు ఉపాధ్యాయులలో ఇద్దరికి మాత్రమే సెలవు ఇవ్వాల్సి ఉండగా ముగ్గురికి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. అత్యవసరమైతే ఉపాధ్యాయులను సర్దు బాటు చేయాలి కదా అని అగ్రహం వ్యక్తం చేశారు

### మూడో ఉపాధ్యాయుడు అత్యవసరంతో సెలవు పెట్టాడు– ఎంఈవో

ఉపాధ్యాయులకు సెలవు మంజూరు అధికారం సంబంధింత కాంప్లెక్స్ హెచ్‌ఎంకు ఉంటుందని ఎంఈవో జయరాజ్ తెలిపారు. పాటిమీదిగుంపు ఉపాధ్యాయుల సెలవులపై వివరణ ఇస్తూ పాటిమీదిగుంపు హెచ్‌ఎం సీతారాములు, టీచర్



సరిత సెలవులలో ఉన్నారు. మరో ఉపాధ్యాయుడు హరి సోమవారం అత్యవసరంగా పని ఉందనే సెలవు పెట్టాడు దీంతో ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారు. విషయం తెలుసుకోని వెంటనే మధ్యాహ్నం సమయానికి ఉపాధ్యాయుడిని సర్ధుబాటు చేశాం.

## నిత్యావసర సరుకులు పంపిణీ

**వైరాసూర్యమేజర్ న్యూస్:**
సరైన ఉపాధి దొరకక కుటుంబంలోని వృద్ధులను పోషించడానికి సరైన ఆర్థిక వనరులులేక సోదరులు లేక అందరి భారం ఒక్కడే మోస్తూ జీవనం సాగిస్తున్న గొల్లెనపాడు నిరుపేద కుటుంబానికి చెందిన నరేష్ కు క్లబ్ కార్యదర్శి అబ్బూరి రమేష్ సహకారంతో నిత్యవసర సరుకులు అందించటం మంచి పరిణామం అని వైస్ డిస్టిక్ గవర్నర్ %××% నంబూరు మధు, లయన్స్ క్లబ్ వైరా అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్ర రావు అన్నారు స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు క్లబ్ అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వైరా కార్యదర్శి అబ్బూరి రమేష్, కోశాధికారి చింతలపూడి వెంకటేశ్వరరావు కోదండ రామాలయం చైర్మన్ మిట్టపల్లి సత్యంబాబు కొల్ల రాంబాబు, కొమిరిశెట్టి శ్రీధర్, కట్ల సురేష్,




రాయపూడి నారాయణరావు, జి .రామకృష్ణ, బండారు సరిత , ఎం చంద్రశేఖర్ ఎం హనుమంతరావు వాణిశ్రీ, శ్రీను తదితరులు పాల్గొనినారు.

## కాలనీ నాచారంలో ప్రత్యేక వైద్య శిబిరం



**ఏన్కూర్ సూర్య మేజర్ న్యూస్:**
మండల పరిధిలోని కాలనీ నాచారం గ్రామంలో కీళ్ళ నొప్పులతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో గత నెల నుంచి జ్వరాలతో బాధపడినగ్రామస్తులు, జ్వరాలు తగ్గిన తరువాత విపరీతమైన కీళ్ళ నొప్పులతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వారి ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 102 మందికి వైద్య పరీక్షలు చేసి వైద్యం చేశారు. మందులు అందజేశారు. కీళ్ళ నొప్పుల రావడానికి గల కారణాలను తెలుసుకునేందుకు 61 మందికి రక్త నమూనాలు సేకరించి టి -హబ్ కు పరీక్ష నిమిత్తం పంపించారు. పరిసరాలను పరిశుభ్రత, ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రాములు, సర్పంచ్ వరసరాంబాబు,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## స్టాఫ్ నర్స్ ఉద్యోగాలు సాధించిన అన్నదమ్ములు

**వైరాసూర్యమేజర్ న్యూస్:**



వైరామున్సిపాలిటి "సోమవరం"పదకొండవ వార్డ్ లొఒకే ఇంటికిచెందిన ఇద్దరు అన్నదమ్ములు స్టాఫ్ నర్స్ ఉద్యోగాలను సాధించారు. గత రాత్రి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్టాఫ్ నర్స్ ఉద్యోగ నియామక ఫలితాల్లో వైరా మండలానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు స్టాఫ్ నర్స్ ఉద్యోగాలకు ఎంపికైనారు. వివరాల్లోకి వెళితే వైరా మండలం సోమవరము గ్రామానికి చెందిన ఎల్.ఐ.సి ఏజెంట్ గా విధులు నిర్వహిస్తున్న ఎస్.కే గౌస్ మియా – మహబూబ్ బీ దంపతుల ఇద్దరు కుమారులు హనీఫ్ పాష, అసిఫ్ పాషాలు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన స్టాఫ్ నర్స్ ఉద్యోగ నియామక పరీక్షల్లో ఈ ఇరువురు అన్నదమ్ములు ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికకాబడ్డారు. ఒకే ఇంటి నుండి ఇద్దరు అన్నదమ్ములు స్టాఫ్ నర్స్ ఉద్యోగాలకు ఎంపిక కావడంతో సోమవరం గ్రామస్తులు వార్డ్ కౌన్సిలర్ దారెల్లి పవిత్ర కుమారి. షేక్ బాబూజాని. పఠాన్ సైదాఖాన్. సయ్యద్ అతావుల్లా. సైతం ఆనందం వ్యక్తం చేయడంతో పాటు, ఎల్ .ఐ. సి డెవలప్ మెంట్ ఆఫీసర్ మన్నవ సుధాకర్ ఉద్యోగాలు సాధించిన అన్నదమ్ములకు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు.

## వివిధ విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులు

### విద్యార్థిని,విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపిక

**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్**
మండల కేంద్రంలో జి హెచ్ ఎస్ పాఠశాల నందు ఎల్టా స్పెషల్ బి విజార్డ్ ఎండ్ డ్రామా విభాగంలో మండల స్థాయి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్,బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రత్నకుమారి,అప్పుల నరసింహపురం వెంకటయ్య,మండల కన్వీనర్ ముత్యాలు,కో కన్వీనర్ శంకర్ రెడ్డి,జిల్లా ఎగ్జిక్యూటివ్ జయరాజు హాజరయ్యారు. ఈ పోటీల్లో బహుమతి పొందిన వారు. స్పెషల్ విజర్డ్ విభాగంలో గౌట్ హై స్కూల్ ప్రథమ బహుమతి,ధర్మ విభాగంలో మొదటి బహుమతి జడ్పీహెచ్ఎస్ ఆరెగూడెం పాఠశాల విద్యార్థులు సాధించారు. విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారని వెల్లడించారు.



## ఉపాధ్యాయుల కొరత తో ఎస్.ఎస్.సి ఫలితాల సాధన ఎలా?

వర్క్ అడ్జస్ట్మెంట్ ద్వారా తగు చర్యలు తీసుకోవాలి

నాన్ టీచింగ్, స్లీపర్ స్టాప్ ఏర్పాటు చేయాలి.

పాఠశాలలలో కనీస సౌకర్యాలు కల్పించాలి

ప్రధానోపాధ్యాయుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు రాయల వీరస్వామి



**మధిర: సూర్య (మేజర్ న్యూస్)**

పాఠశాలలలో కనీస అవసరాలు కనిపించాలని మధిర, ఎర్రుపాలెం మండలాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల (టివియం)లో వై. ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు రాయల వీరస్వామి ప్రధాన కార్యదర్శి బుగ్గినేని నాగేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ దామాల పుల్లయ్య సర్వ శిక్ష అభియాన్ మన ఊరు – మనబడి జిల్లా సెక్రటేరియల్ అధికారి జి హెచ్ ఎస్, సి పి ఎస్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రామకృష్ణ మరియు మధిర ఎర్రిపాలెం మండలాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా సంఘం అధ్యక్షులు శ్రీ రాయల వీరస్వామి మాట్లాడుతూ ఎస్ఎస్సి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నప్పటికీ ఇంకా చాలా ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు టీచర్ల కొరత తీవ్రంగా వేధిస్తుందని వర్క్ అడ్వైజ్మెంట్ అడ్జస్ట్మెంట్ ద్వారా వెంటనే తగు చర్యలు తీసుకొని విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. కనీసం స్వీపర్ నాన్ టీచింగ్ స్టాఫ్ లేక ప్రధానోపాధ్యాయులు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారన్నారు. బోధనే కాక వివిధ బాధ్యతలతో సతమతమవుతున్నారన్నారు. పరీక్షల తరముకు వస్తున్న వేళ విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహణ ఉపాధ్యాయుల లేమి తో కష్టమవుతుందన్నారు. ఈ పరిస్థితులలో ఎస్ఎస్సి ఫలితాల సాధన ఎలా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం అధ్యక్షులు శ్రీ పాలువాయి వెంకటేశ్వరరావు రాయల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**చింతకాని సూర్య మేజర్ న్యూస్..**

మండల పరిధిలోని తిమ్మినేనిపాలెం ఉన్నత పాఠశాల లో 2005- 2006 పదోవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత ప్రధాన ఉపాధ్యాయులు చిరంజీవి నాయుడు , మాజీ ప్రధాన ఉపాధ్యాయులు ముఖ్య అతిధులుగా బి. లక్ష్మీనారాయణ , శ్రీరామ్ ,కిరణ్మయి , నాగేంద్రయ్య ,బాబు , మణికుమార్ రాజ్యలక్ష్మి ,పూర్వ వాలంటీర్లు మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రోజు కూలీ రూ.700 ఇవ్వాలి

**సత్తుపల్లి సూర్య మేజర్ న్యూస్**

ఉపాది హామీ కూలీలకి రోజు కూలీ రూ.700 ఇవ్వాలని, ఉదయం,సాయంత్రం మాస్టర్ విధానం రద్దు చేసి, కూలీలందరికి పనులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బి.కే.ఎం.యూ ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. మండల పరిదిలోని రామానగరంలో సోమవారం జరిగిన ఉపాధి కూలీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడీ ఉదాసీన వైఖరి వ్యవహరిస్తున్నారని, ఉపాధి హామీ పథకంలో 30 వేల కోట్ల రూపాయలు నిధులు తగ్గించి ఉపాధి హామీ కూలీల పొట్ట కొట్టారని విమర్శించారు. గ్రామాల్లో ప్రతికూలికి ఉపాధి హామీ పథకం లో పని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాములు, వెంకటేశ్వర ప్రసాద్, రజిని ,లక్ష్మి ,రాములమ్మ, సుజాత ,శ్రీలత ,సత్యభామ, లక్ష్మి ,సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## విఎం బంజర్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ గా కె. వెంకటేష్

**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్...**



విఎం బంజర్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ గా కరి వెంకటేష్ భాధ్యతలు చేపట్టానున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ప్రస్తుత ఎస్హెచ్ఓ జి. సూరజ్ బదిలీ పై ఖమ్మం విఆర్ కు కేటాయిచడంతో ఆయన స్థానంలో వెంకటేష్ భాద్యతలు చేపట్టానున్నారు. గతంలో కల్లూరు లో ఎస్ఐ గా పని చేసిన వెంకటేష్ కు పలువురు శుభాకాంక్షలు తెలియజేసారు.

## జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతనంగా ఎన్నికైన డి. సి.ఎం.ఎస్ చైర్మన్ కొత్వాల



**ఖమ్మం, (సూర్య బ్యూరో):**

నూతనంగా ఎన్నికైన డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఖమ్మం లోని నూతన కలెక్టరేట్ భవన సముదాయంలో కలెక్టర్ ను కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన: సైబర్ క్రైమ్ ఏసీపీ



**ఖమ్మం సూర్య బ్యూరో...**

సైబర్ మోసగాళ్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని తమకు అనుకూలంగా మార్చుకొని అమాయకులను బురిడీ కొట్టిస్తూ అనేక రకాలుగా నేరాలకు పాల్పడుతున్నారని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏసీపీ కె.శంకర్ అన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు సైబర్ నేరాల అవగాహన కోసం ఈరోజు నగరంలోని ప్రభుత్వ ఉమెన్స్ జూనియర్ కళాశాల, పులిపాటి నర్సింగ్ కాలేజ్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీపిఎస్ ఏసీపీ మాట్లాడుతూ..పెరిగిపోతున్న టెక్నాలజీకి తగ్గట్టుగానే సైబర్ నేరాలు విజృంభిస్తున్నాయని, ఈ తరహా నేరాల్లో మనుషులు కనిపించరని, వారి గొంతూ వినిపించదని, కానీ మోసాలు జరిగిపోతుంటాయని అన్నారు. ఖాతాల్లోని డబ్బులు దోచుకోవడమే కాకుండా... ఫోన్లలోని రహస్య సమాచారాన్ని సైతం తస్కరిస్తారని అన్నారు. కేవలం అవగాహనలేమి కారణంగా వ్యక్తిగత గోప్యత, భద్రత కోల్పోతున్నారని తెలిపారు. సైబర్‌నేరగాళ్లు ఏదో ఆశ చూపి వల వేస్తుంటారని, గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్‌లో మాట్లాడి.. ఏదైనా స్కీమ్ గురించి చెబితే అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్‌నేరగాళ్ల చేతిలో పడి మోసపోతే.. వెంటనే సైబర్‌క్రైమ్ టోల్‌ఫ్రీ నంబర్ లోని 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

సైబర్ నేరాలను అడ్డుకోవడంలో భాగంగా కేంద్రం 1930 టోల్ ఫ్రీ నంబర్‌తో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందని. తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీఎస్‌బీ) ఆధ్వర్యంలో 24/7 ఈ కాల్‌సెంటర్ పనిచేస్తుందని తెలిపారు. ఈ సెంటర్‌కు వచ్చే కాల్స్‌ను మేనేజ్ చేసేందుకు అత్యాధునిక టెక్నాలజీ సాఫ్ట్‌వేర్‌ను పోలీసులు ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా టోల్‌ఫ్రీ నంబర్‌కు వచ్చే కాల్స్ నేరుగా అక్కడ పనిచేసే సిబ్బందికి వెళ్తుంటాయని తెలిపారు. ఈ కాల్ సెంటర్‌కు ఆయా బ్యాంకుల రిస్క్‌మేనేజ్‌మెంట్ టీమ్‌లు అనుసంధానమై ఉంటాయని. సైబర్‌నేరాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి, తమ వైపు నుంచి తక్షణ చర్యలు తీసుకునేందుకు రిస్క్‌మేనేజ్‌మెంట్ టీమ్స్‌ను అందుబాటులో ఉంటాయని తెలిపారు. దీంతో కాల్‌సెంటర్ నుంచి సమాచారం వెళ్లగానే.. ఆయా బ్యాంక్ రిస్క్ మేనేజ్‌మెంట్ టీమ్స్ అప్రమత్తమై బ్యాంకు ఖాతాల ఆధారంగా డబ్బు ఎక్కడికి వెళ్లిందనే విషయాన్ని గుర్తించి, ఆ ఖాతాలను ఫ్రీజ్ చేస్తారని తెలిపారు. నేరగాళ్లు ఆ ఖాతాల్లో నుంచి డబ్బు డ్రా చేయకుండా ఉంటే.. అందులో ఉండే నగదు కూడా ఫ్రీజ్ అవుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా అప్లికేషన్స్ మోసాలు, ఆన్‌లైన్ జాబ్ మోసాలు, కస్టమర్ కేర్ మోసాలు, క్రెడిట్ అండ్ డెబిట్ కార్డ్ మోసాలు, ఆధార్ ప్రామాణీకరణ మోసాలు మరియు ఒలెక్స్ మోసాలు మరియు డయల్ 1930 మరియు (యన్ సిఆర్పీ) నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ గురించి 24 గంటల్లో ఫిర్యాదు చేయడం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఎస్ఐ విజయకుమార్, కళాశాలల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

## పశుగ్రాసం వితరణ



**కల్లూరు సూర్య న్యూస్ జనవరి (29) :**

వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మంలోని శ్రీ వెంకటేశ్వర కృష్ణ గోశాల కు కల్లూరు నుంచి సుమారు 14 ట్రాక్టర్ల పశుగ్రాసం తుమ్మల నాగేశ్వరరావు వితరణ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షులు నల్లమల వెంకటేశ్వరరావు రైతుబంధు సమితి జిల్లా మాజీ కమిటీ మెంబర్ పసుమర్తి చందర్రావు మాజీ జడ్పిటిసి సభ్యులు షేక్ యాకూబ్ అలీ గారు రైతు నాయకులు ఉబ్బన గోపాలస్వామి పాల్గొనడం జరిగింది.

## ఠాగూర్ లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**వైరాసూర్యమేజర్ న్యూస్:**

స్థానిక ఠాగూర్ విద్యాలయంలో 2014–15 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం లో కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ మాట్లాడుతూ 10 సంవత్సరాలకు కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత ఉద్యోగాలు సాధించి కుటుంబ అభివృద్ధికి సమాజాభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. వివిధ వృత్తులలో స్థిరపడిన వారిని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో చాలా సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ మరియు అధ్యాపకులు చంద్రశేఖర్,రామకృష్ణ,వేణు, నాగరాజు,రాంబాబు,నాగేంద్రబాబు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యదిక ప్రాధాన్యత ఇవ్వాలి

**- జిల్లా కలెక్టర్ వి పి గౌతమ్**





**ఖమ్మం,(సూర్య బ్యూరో)**
ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి సత్వర పరిష్కార చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరం "గ్రీవెన్స్ డే" లో అర్జీదారుల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి తగు చర్య నిమిత్తం సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పరిష్కార స్వభావం కలిగిన భూ సమస్యలను జిల్లా కలెక్టర్ సత్వరమే పరిష్కారించారు. కల్లూరు గ్రామీణ మండలంకు చెందిన యనమల సోమయ్య, సర్వేనెం.643/1లో విస్తీర్ణం సవరణ కొరకు ధరణి టిఎం రోడ్యూల్ ద్వారా దరఖాస్తు చేయగా రికార్డులు, ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రకారము సోమవారం నాడు సమస్య పరిష్కారం చూపన్కెనది. బోనకల్ మండలం ,చొప్పకట్ల పాలెంకు చెందిన కోటపర్తి నాగేశ్వరరావు సర్వేనెం.20/ఎఎలలో మిస్సింగ్ సర్వేనెం. వున్నందున దరఖాస్తు చేయగా, దరఖాస్తు దారుడ ఇపిపిబి పొందియున్నందున దరఖాస్తును సోమవారం నాడు ఆమోదించి, దరఖాస్తు పరిష్కారం గావించన్కెనది. పెనుబల్లి మండలం లంకపల్లికి చెందిన మనికాల గోపాలరావు లంకపల్లి రెవెన్యూ గ్రామంలో సర్వేనెం.321/ఈ లో ఎ.2.08 గుంటలకు సంబంధించి 0.18 గుంటల మిస్సింగ్ సర్వేనెంబరుకు సంబంధించి మ్యుటేయేషన్ సమస్యకు పరిష్కారం చూపారు. కూసుమంచి మండలం నాయకన్ గూడెం గ్రామంకు చెందిన కంచెర్ల పూలమ్మ తనకు సర్వేనెం.17ఏ1/3/1లో ఎ.1.0150 కుంటల భూమికి గాను పట్టాదారు పాసుపుస్తకములో తక్కువ నమోదు కావడం జరిగినదని అట్టి మిస్సింగ్‌కు సంబంధించిన 0.08 కుంటలు పాత రికార్డు ప్రకారం నమోదుకావాల్సి ఉన్నదని అట్టి మిస్సింగ్‌కు సంబంధించి సమస్యకు పరిష్కారం చూపారు. ఖమ్మం నగరం వికలాంగుల కాలనీకి చెందిన బుత్తల వినయ్ తాను వికలాంగుడనని, తన తల్లిదండ్రుల చాల పేదవారని అద్దెఇంట్లో ఉంటు జీవనం కొనసాగుస్తున్నామని, తమకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం అదనపు కలెక్టర్‌కు సూచించారు. చెరువుమాదారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం, వ్యాపరా పరిధినందు గల షహజాదా చెరువు నందు నూతనంగా ఏర్పడిన కమిటి జనరల్ బాడి సమావేశము నిర్వహించి సభ్యులకు రూ.100 చొప్పున ఇచ్చి సంతకాలు పెట్టించుకొని గుత్తేదారు చేపలు పట్టుకొనుటకు కమిటీ తీర్మాణం చేయటం జరిగినదని, అట్టి తీర్మాణంను నిలుపుదల చేసి కేవలం సంఘ సభ్యులు మాత్రమే చేపలు పట్టుటకు అనుమతించగలరని నేలకొండపల్లి మండలం మంగాపురం తండాకు చెందిన పాల్యా కోట్యా సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం మత్స్యశాఖ ఏడికి ఎండార్స్ చేసినారు. సత్తుపల్లి మండలం తుంబూరు గ్రామంకు చెందిన యశోద శ్రీరామమూర్తి తన సోదరి జయలక్ష్మి మే,2023 మాసంలో మరణించడం జరిగినదని, వారికి ఎటువంటి సంతానము లేదని, వారి పేరున తుంబూరు రెవెన్యూ రికార్డు దఖలా వున్న స.నెం.400/ఉలో 016 కుంటలు, సర్వేనెం.402/ఇలో 01 కుంట, సర్వేనెం.406లో య..1--09 కుంటలు వెరశి య.1-26 కుంటల భూమికలదని వారు వారి జీవితకాలంలో ఎవరిని దత్తత తీసుకోవడం జరగలేదని, కాని వంకదారు మధు, వ్యక్తి తన సోదరి భూమిని ఆక్రమించుకోవాలని వారసత్వ రీత్యాపట్టామార్పిడి చేయించుకోవాలని ఆన్‌ల్కెన్‌లో స్లాట్ బుక్ చేసుకోవడం జరిగినదని అట్టి అక్రమ వారసత్వ పట్టా మార్పిడిని నిలుపుదల చేసి తమకు న్యాయం చేయగలరని సమర్పించిన దరఖాస్తును తహాశీల్దారు సత్తుపల్లిని తగు చర్య నిమిత్తం ఆదేశించారు. చింతకాని మండలం, పాతర్లపాడు గ్రామ ఉప సర్పంచ్ తేలుకుంట్ల వెంకటశ్రీనివాసరావు తమ గ్రామమునకు ఆర్‌టి.సి బస్సు సౌకర్యం కల్పించగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం ఆర్ ఆర్‌టిసిని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్‌నాయక్, శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్‌సింగ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు "గ్రీవెన్స్ డే" లో పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి చొరవ తో గ్రామ ప్రజల ఆరేళ్ల కల సహకారం

**అప్పలనరసింహాపురం కు బస్సు సౌకర్యం కల్పించిన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్ మండలం లోని అప్పలనరసింహాపురం కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ తో ఆర్టీసీ బస్సు సౌకర్యం ను కల్పించారు.గత ఆరేళ్ల నుంచి బస్సు సౌకర్యం కోసం గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు.గత పాలకులకు తెలిపినా పట్టించుకోలేదు.ఈ విషయం ను స్థానిక కాంగ్రెస్ నాయకులు మంత్రి క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.వెంటనే స్పందించి ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు... తగిన చర్యలు తీసుకోవాలని సూచించటంతో సోమవారం గ్రామంలోకి బస్సు ను పంపించారు.దీంతో చాలా కాలం తరువాత బస్సు ను చూసిన గ్రామస్తులు సంతోషం ను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెనికె జానకిరామయ్య మాట్లాడుతూ... ఆరేళ్ల నుంచి గ్రామస్తులు బస్సు కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడి తో తోపాటు దయాకర్ రెడ్డి కి గ్రామస్తులు తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మన్నే నగేష్,శీలం పెద్ద వెంకటేశ్వర్లు, పుసులూరి విశ్వనాథం, పెంటమల్ల అశోక్, వెంపటి స్వామి, అయినాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## మట్టా ను కలిసిన బీసీ విద్యుత్ ఉద్యోగులు

**- డైరీ ఆవిష్కరణ చేసిన మట్టా**



**సత్తుపల్లి సూర్య మేజర్ న్యూస్** బీసీ విద్యుత్ ఉద్యోగుల నూతన డైరీ, క్యాలెండర్ ను జిల్లా కాంగ్రెస్ నాయకులు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. ముందుగా విద్యుత్ ఉద్యోగులు డా.మట్టా ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా బీసీ అధ్యక్షులు శ్రీ నారాయణ వరపు శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు షణ్ముఖ చారి, బలరాం, ప్రసాద్,రాజు, వెంకటేశ్వరరావు, మహెబూబ్ అలి,మస్తాన్, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు మేలు జరగాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం

**-రైతులు కన్నీరు పెట్టకూడదు**
**- రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాతి, రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉంది**
**- పచ్చి పంటలకు నష్టం రాకుండా ప్రాసెసింగ్,స్టోరేజి చేసుకునేలా ఫుడ్ పార్క్ ఉపయోగపడుతుంది.**
**- ఇష్ట పడి గెలిపించారు...కష్టపడి పని చేస్తాం**
**-రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల.**







**సూర్య బ్యూరో/సత్తుపల్లి మేజర్ న్యూస్**
పంట పండించే రైతు కన్నీరు పెట్టకూడదనే రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని,రైతులను, ప్రాసెసర్ లను, రిటైలర్ లను ఏకతాటిపైకి తెచ్చి, వ్యవసాయ ఉత్పత్తిని మార్కెట్ కు అనుసంధానించే యంత్రాంగాన్ని అందించడమే లక్ష్యంగా మెగా ఫుడ్ పార్క్ ఏర్పాటు జరిగిందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం సత్తుపల్లి మండలం బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ ను స్థానిక ఎం.ఎల్.ఏ డా.మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్,అశ్వారావుపేట ఎం.ఎల్.ఏ జారే ఆదినారాయణలతో కలిసి సందర్శించారు. అనంతరం ఫుడ్ పార్క్ లో చేపట్టిన పనులు, జరగాల్సిన పనులు, కావాల్సిన సదుపాయాల గురించి అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ. 70 కోట్ల అంచనా వ్యయంతో 2016 లో బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారని, మౌళిక సదుపాయాలు, కోల్డ్ స్టోరేజ్, పరిపాలనా భవన నిర్మాణాలు పూర్తయి, యూనిట్ల ఏర్పాటుకు ప్రాథమిక వనరులు అన్ని సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. జీడిపప్పు, మామిడి ప్రాసెసర్లు వచ్చారని, త్వరలోనే అన్ని పంటలకు, కూరగాయలకు ప్రాసెసింగ్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. పండే పంటలు సరైన స్టోరేజి లేక పొలాల్లోనే చెడిపోతున్నట్లు, ఫుడ్ పార్క్ తెస్తే, ఇక్కడ స్టోరేజి చేసి, సంబంధ ఉత్పత్తులు తయారుచేస్తారని, దీంతో రైతులకు మేలు కలుగుతుందని మంత్రి తెలిపారు. ప్రతి పంట చేనులో వృధా కాకుండా కోల్డ్ స్టోరేజి లేకా ఫుడ్ ప్రాసెసర్ యూనిట్ కి వెళ్లేలా చూడాలని, దీంతో రైతు పండించిన పంటకు డిమాండ్ తో పాటు, నష్టం వాటిల్లకుండా ఉంటుందని ఆయన అన్నారు. ఈ రోజు ప్రపంచ దేశాలన్నీ మన వైపు చూస్తున్నాయని, ఏ దేశంలో ఏ పంటకు డిమాండ్ ఉంది, ఎక్కడైతే మార్కెట్ బాగుంటుంది తెలుసుకొని అక్కడకు ఎగుమతి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంట పండించే రైతు కన్నీరు పెట్టకూడదనే రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ విషయమై ముఖ్యమంత్రి ఆలోచన చేసి, కొన్ని కంపెనీలతో ఒప్పందం చేసుకున్నారన్నారు. పామాయిల్ విత్తనం దిగుమతి చేసుకునే అవసరం లేకుండా ఇక్కడే తయారుచేసుకునే విధంగా మన దేశం, మన రాష్ట్రం, మన జిల్లాలో గోద్రెజ్ కంపెనీతో ఒప్పందం చేసుకునేలా చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. రైతులకు సరైన ధర, గిట్టుబాటు తో మేలు జరుగుతుందన్నారు. వచ్చే నెలలో మెగా ఫుడ్ పార్క్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ఆయన తెలిపారు. ఫుడ్ పార్క్ లో విద్యుత్, ఇతర సమస్యలు ఉంటే వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీ పనులు త్వరలో పూర్తి కానున్నట్లు ఆయన తెలిపారు. రైతులు మేలు జరిగే సాంకేతికతను అలవర్చుకోవాలని మంత్రి అన్నారు. రాష్ట్రంలో ఉన్న 12500 రైతు వేదికల్లో స్క్రీనులు ఏర్పాటు చేసి, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, ఆదర్శ రైతులతో ఇంటరాక్ట్ అయ్యేలా కార్యక్రమాలు రూపొందించనున్నట్లు, ఇందులో రైతులు పాల్గొని, పంట దిగుబడి, మార్కెటింగ్ విషయమై సమాచారం, సలహాలు పొందవచ్చని, సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని మంత్రి అన్నారు. ఇట్టి విషయమై రైతులకు అవగాహన కల్పించాలని, ఈ దిశగా విస్తృత ప్రచారం చేయాలని మంత్రి తెలిపారు. అడవులు ధ్వంసం అయ్యాయని, పర్యావరణం దెబ్బతిందని, ఈ దిశగా ఆలోచన చేయాలని మంత్రి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాతని, రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు డా. మట్టా దయానంద్ విజయకుమార్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ నున్నా రామకృష్ణ , చల్లగుళ్ళ నరసింహారావు, తమ్మిన రవి,వినుకొండ కృష్ణ, రాయల నరేంద్రకుమార్, వెచ్చా రాంప్రసాద్,విరివాడ అజయ్,కొండపల్లి మహేష్, పరిశ్రమల శాఖ జోనల్ మేనేజర్ పవన్ కుమార్, జిల్లా పరిశ్రమల అధికారి అజయ్ కుమార్, కల్లూరు ఆర్డీవో అశోక్ చక్రవర్తి, ఏసీపీ రామానుజం, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

